
# కథ

**జి.అరుణ**




**కొం**దరితో మాట్లాడుతున్నా లేక మౌనంగా వారి పక్కనే కూర్చున్నా మనసుకు ఎంతో ప్రశాంతంగా, ఆహ్లాదంగా అనిపిస్తుంది. వారు చెంతన ఉంటే చాలు మనకు తెలియకుండానే ముఖంపై చిరునవ్వు కదులాడుతుంది. ఇతరత్రా కారణాల వల్ల మనసులో చోటు చేసుకున్న చిరాకు, విసుగు మటుమాయమై వాటి స్థానంలో ప్రసన్నత చోటు చేసుకుంటుంది. వీటన్నిటికీ కారణం ఇరువురి ప్లానెటరీ కాంబినేషనే మూలమేమో అనిపిస్తుంది షణ్ముఖసాయికి.

తమ ఆఫీసుకు ట్రాన్స్‌ఫరై వచ్చిన సాకేతను మొదటిసారి చూసినపుడు కొత్తగా చూసిన భావం కలగలేదు అతనికి. చాలా కాలం తర్వాత కలిసిన ఆత్మీయురాలిగా అనిపించింది.

మేనేజర్ ఆమెను ఇంట్రడ్యూస్ చేసినపుడు అంతకుముందే తెలిసినవాడిలా స్నేహపూర్వకంగా నవ్వి పనిలో నిమగ్నమయ్యాడు.

సాకేత జాయినైన వారం రోజులకు షణ్ముఖసాయి పక్క సీటులో ఉండే కౌసల్య మెటర్నిటీ లీవ్‌లో వెళ్లింది.

''రాముడి లాంటి కొడుకును కని ఆరునెలలపాటు వాడితో ఆనందంగా గడిపి ఆ తర్వాత మీ అత్తగారికి అప్పగించి ఆఫీసుకు రా" సీనియర్ క్లర్క్ సత్యవతి నిండు మనసుతో అంది.

అందరూ సరదాగా నవ్వారు.

కౌసల్య స్థానంలోకి సాకేత వచ్చింది.

తన పక్క సీటులోకి వచ్చి కూర్చున్న సాకేతను చూడగానే సంతోషంగా అనిపించింది షణ్ముఖసాయికి.

మాట్లాడే అలవాటు తక్కువ కాబోలు అరుదుగా మాట్లాడేది అతనితో.

చొరవ తీసుకుని సంభాషణ పొడిగించే తత్వం లేక షణ్ముఖసాయి కూడా వర్క్ విషయంలో ఆమె ఏదైనా అడిగితే క్లుప్తంగా సందేహనివృత్తి చేసేవాడు కాని అంతకుమించి మాట్లాడేవాడు కాదు.

ఆఫీసులో ఉన్నంతసేపు పని చేయడం తప్ప ఇతర విషయాల మీద ఆమెకు ధ్యాస ఉండదు.

కారణం తెలియదు గాని సాకేత తన పక్క సీటులో ఉందన్న భావం అతనికి ఆహ్లాదాన్ని కలిగించేది.

ఒకసారి వరుసగా మూడు రోజులు ఆఫీసుకు రాలేదామె.

"మేడమ్ సెలవు పెట్టారెందుకు? ఊరికి వెళ్ళారా?" రెండో రోజున క్యాజువల్‌గా అడిగాడు సాకేతకు అటువైపు సీటులో ఉన్న జెస్సీని.

"జ్వరం వచ్చిందట! ఫోన్ చేసి చెప్పారు" అందామె.

వెంటనే వెళ్లి సాకేతను చూడాలన్న కోరికను బలవంతంగా అణచుకున్నాడు. నంబర్ తెలుసుకుని ఫోన్ చేయాలనిపించినా ఆ ఆలోచన విరమించుకున్నాడు.

అతనికి ఆశ్చర్యంగా అనిపించింది.

చెప్పుకోదగ్గ సాన్నిహిత్యం లేకపోయినా సహోద్యోగులు ఒకరిమీద మరొకరు ఇంతగా ప్రభావం చూపగలరా అని తనలో తాను ప్రశ్నించుకున్నాడు.

నాలుగో రోజు కాస్తంత నీరసించిన ముఖంతో ఆఫీసుకు వచ్చిందామె.

సాకేతను చూడగానే అతని మనసు సంతోషంతో ఉరకలేసింది.

"బావున్నారా? జ్వరం తగ్గిందా?" చిరునవ్వుతో అడిగాడు పక్కకు తిరిగి.

బావున్నానన్నట్లు నవ్విందామె.

"బాగా చిక్కిపోయారు "అప్పుడే వచ్చి సీటులో కూర్చుంటున్న జెస్సీ నవ్వుతూ పలకరించింది.

సిస్టమ్ ఆన్ చేస్తున్న సాకేత తలతిప్పి ఆమె వైపు చూసి తేలిగ్గా నవ్వేసింది. మరో రెండు నిమిషాల్లో పనిలో నిమగ్నమైందామె.

అతను పని చేస్తున్నా మనసులో సాకేత గురించిన

ఆలోచనలు పరిభ్రమిస్తున్నాయి. ఆలోచించడమే తప్ప ఆమె వైపు పదే పదే చూసే స్థాయికి దిగజారదలచుకో లేదు.

నిత్యం ఎందరో స్త్రీలను తాను చూస్తునే ఉంటాడు. సౌందర్యం మూర్తీభవించిన చాలా మంది స్త్రీలు తారసపడ్డా స్పందించని తన మనసు సాకేత కోసం ఆరాట పడుతోంది.

సాధారణమైన అందంతో ఉండే సాకేత తనను మానసికంగా కట్టి పడేస్తోందేమిటి? తమ ఆఫీసులో పెళ్లి కాని యువతులు ఎందరో ఉండగా సాకేత మాత్రమే తనను ఆకర్షిస్తోంది ఎందుకు? ప్రేమంటే ఇదేనా?

సాయికి తన మనసు ఏమిటో ఇపుడు బాగా అర్థమైంది.

తాను ఆమె సాన్నిధ్యాన్ని బలంగా కోరుకుంటున్నాడు. ఆమెను అమితంగా ఇష్టపడుతున్నాడు.

సాయంత్రం ఇంటికి వెళ్లిన తర్వాత కూడా సాకేత అతని కళ్లముందు కదులాడుతోంది. ఆమె అవివాహిత అని తెలుసు. కాని అంతకు మించి వివరాలు తెలియవు.

ఇరవై ఎనిమిది సంవత్సరాల వయసున్న తాను పాతికేళ్ల వయసులో ఉన్న సహోద్యోగిని ముందు ఐ లవ్‌యూ అనే సినిమా డైలాగ్ వర్ణించడం హాస్యాస్పదంగా ఉంటుంది. తన మనసులో మాట ఆమెతో ఎలా చెప్పాలి? ఆలోచనలో పడ్డాడు.

"మీతో కొద్దిసేపు మాట్లాడాలి. సాయంత్రం మినర్వా కాఫీ షాప్‌కు రాగలరా?" అభ్యర్థనగా అడిగాడు ఒకరోజు ధైర్యం చేసి.

తలతిప్పి చురుగ్గా చూసింది సాకేత.

ఇతనేదో బుద్ధిమంతుడని తాను ఇన్నాళ్ళు భ్రమపడింది. ఇపుడు కాఫీషాప్‌కు రమ్మంటున్నాడేమిటి?

"ఏం మాట్లాడతారు?" కోపం తమాయించుకుని ప్రశ్నించింది.

ఆమె కళ్లలో చిరాకు కొట్టొచ్చినట్టు కనిపించింది.

జెస్సీ వారివైపు కొద్ది క్షణాలు చూసి మళ్లీ పనిలో నిమగ్నమైంది.

అతను తడబడ్డాడు.

"ఇక్కడ మాట్లాడితే బావుండదు. సాయంత్రం మినర్వా..."

"అయాం సారీ! ఏం మాట్లాడదలచుకున్నారో ఇక్కడే చెప్పండి లేదా మానేయండి. రెస్టారెంట్లకు, పార్కులకు వెళ్లి మాట్లాడుకునేంత స్నేహం మన మధ్య లేదు"

ముఖం మీద కొట్టినట్టు మాట్లాడింది.

ఆమె మాట్లాడిన తీరుకు మనసు చిన్నబుచ్చుకున్నాడు.

జెస్సీ వారివైపు చూసి లేచి అవతలకి వెళ్లింది పని ఉన్నట్లు. మనసులో ఆమెకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

అతనికి మొండి ధైర్యం వచ్చేసింది. తన మనసులోని మాట ఇప్పుడు చెప్పడానికి వెనకాడితే తర్వాత అయినా ఇదే పరిస్థితి కదా అనుకున్నాడు.

"నాకు మీరంటే ఇష్టం. మీరు ఒప్పుకుంటే మనం పెళ్లిచేసుకుందాం" ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండా గాభరాగా అనేశాడు.

సాకేత ఆశ్చర్యంగా చూసింది. అతను ఆ మాట అంటాడని అసలు ఊహించలేదు.

కొద్ది క్షణాల తర్వాత ఆశ్చర్యం నుండి తేరుకుంది. ఆమె ముఖం ప్రసన్నంగా ఉంది.

"నాకు ఇద్దరు పిల్లలున్నారు. నన్ను పెళ్లి చేసుకునే వ్యక్తి వాళ్ల బాధ్యత కూడా తీసుకోవాలి" నెమ్మదిగా అంది.

షణ్ముఖసాయి ఆశ్చర్యపోయాడు. చూడడానికి ఆమె అవివాహితలా ఉంటుంది. ఆఫీస్ రికార్డ్సులో కూడా అన్‌మ్యారీడ్ అని చూశాడు. తానే పొరపడ్డాడేమో?! సాకేతకు వివాహమై ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారా? పాపం ఆ పిల్లలు పసి వయసులోనే తండ్రి ప్రేమకు దూరమయ్యారా? పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది మనసు.

అతను ఓ నిశ్చయానికి వచ్చేశాడు.

"ఇకనుండి వాళ్లను నా పిల్లలుగా భావిస్తాను. ఏ లోటు లేకుండా చూసుకుంటాను. ఇప్పుడు చెప్పండి. ఈ పెళ్లి మీకిష్టమేనా?" అడిగాడు.

ఆమె నవ్వింది. కాని ఏ సంగతీ చెప్పలేదు.

## ప్చ్! మమత!!

మమతా మోహన్‌దాస్‌కి డైటింగ్ సమస్య చిరాకు తెప్పిస్తోందిట. 'కృష్ణార్జున' సినిమాలో విష్ణుకి జంటగా నటించిన మమతా మోహన్‌దాస్ ఇందులో అతనికి కాస్త దీటుగా కనిపించేలా కొంచెం బొద్దుగా వుండాలని భావించిన దర్శకుడు కొంచెం బరువు పెరుగమ్మా అని సూచించాట్ట. సరేలే అన్న ఆమె మరో సినిమా కోసం నాజూగ్గా తయారుకావాల్సి వచ్చిందిట. వెంట వెంటనే ఇలా లావై, సన్నబడ్డం అంటే తేలికైన విషయం కాదు, కదా! అందుకే సినిమా నటన అంటే విసుగొస్తోందిట ఆమెకి.



వర్తమానం, భవిష్యత్తు మాత్రమే మన చేతిలో ఉన్నాయి కాని గతం మన చేతుల్లో లేదు. ఆమె గత జీవితంతో తనకు సంబంధం లేదు. గతం గురించి ప్రస్తావించి ఎన్నడూ ఆమెను బాధ పెట్టకూడదు- మనసులో దృఢంగా నిశ్చయించుకున్నాడు.

"సాయంత్రం మా ఇంటికి వెళదాం. ఇంటికి వచ్చి చూశాక మీ అభిప్రాయం మారవచ్చునేమో" అంది.

ఇంటికి వెళ్లి పిల్లల్ని చూసిన తర్వాత కూడా తన అభిప్రాయం మారదు. వాళ్లు ఎంత అల్లరి పిల్లలైనా తన ఓర్పుతో, మంచితనంతో వారిని ఆకట్టుకుని తండ్రి ప్రేమ పంచి ఇవ్వగలడు- ధీమాగా అనుకున్నాడు.

సావకాశంగా మాట్లాడుకుందాం, రెస్టారెంట్‌కు రమ్మన్న తన అభ్యర్థనను తిరస్కరించిన సాకేత తనను ఇంటికి ఆహ్వానించడంతో మనసులోనే దేవుడికి థ్యాంక్స్ చెప్పుకున్నాడు.

జెస్సీ వచ్చి సీటులో కూర్చుంది. ఆమె వైపు చూసి ఇద్దరూ పనిమీద మనసు లగ్నం

చేశారు.

సాయంత్రం పని వేళలు ముగిశాక సీటులో నుండి లేస్తూ అతని వైపు చూసింది సాకేత.

"నా వెహికల్‌ను ఫాలో అవుతూ రండి" అంది.

"అలాగే ! సెల్లార్‌లో పార్కింగ్ వద్ద వెయిట్ చేయండి. రెండు నిమిషాల్లో వచ్చేస్తాను ప్లీజ్" గబగబ లిఫ్ట్ వద్దకు వెళ్లాడు.

ఆరో అంతస్తులో ఉన్న లిఫ్ట్ కోసం వెయిట్ చేయకుండా సెకండ్ ఫ్లోర్‌లో నుండి త్వర త్వరగా మెట్లు దిగి గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న సూపర్ మార్కెట్‌లోకి నడిచాడు.

## మారిన మల్లిక!

కాలంతోపాటు మార్పు సహజం అన్నట్టే వయసుతోపాటు మనిషీ మారుతుంటాడనడానికి మల్లికా షెరావత్ తాజా ఉదాహరణ. నిన్నమొన్నటి వరకూ దూకుడుగా వున్న మల్లిక ప్రవర్తన ఇటీవల కాలంలో కాస్త నెమ్మదించిందని బాలీవుడ్ జనాలు చెబుతున్నారు. గతంలో ఎవరు ఎదురుపడినా హాయ్ హాయ్ టైపులో జోరుగా విష్ చేసి చూసీ చూడనట్టుగా వెళ్లిపోయే టైపు మనిషి కాస్త ఇప్పుడు ఎవరు కనిపించినా ఎంతో వినయంగా సాదర నమస్కారాలు చేస్తోందిట. పైగా మాట్లాడే ధోరణిలోనూ జోరు తగ్గింది. ప్రస్తుతం బాలీవుడ్ జనాలతో మల్లిక కూడా ఎంతో మంచమ్మాయి అనిపించుకుంటోంది.



చాకొలెట్లు, రెండు మూడు రకాల బిస్కట్లు తీసుకుని బిల్లు చెల్లించి సెల్లార్‌లోకి వెళ్లాడు.

పార్కింగ్‌లో నుండి తన టూ వీలర్ తీసి బయల్దేరేందుకు సిద్ధంగా ఉందామె.

"వన్‌మినిట్" అమెతో చెప్పి తన వెహికల్ తీసుకువచ్చాడు.

మూడు కిలోమీటర్లు ప్రయాణించి ఓ ఇండిపెండెంట్ హౌస్ ముందు ఆగి వెనుదిరిగి చూసిందామె.

అతను బైక్ ఆపాడు.

"రండి. ఇదే మా ఇల్లు" గేటు తీస్తూ అంది.

ఇంటి ముందు ఖాళీ ప్రదేశంలో ఉన్న పూల మొక్కల్ని చూడగానే మనసుకు ఆహ్లాదంగా అనిపించింది.

శ్రద్ధగా పోషిస్తున్న కనకాంబరం, బంతి, గులాబి మొక్కలకు విరగబూసిన పూలను చూస్తూ అలాగే నిలుచుండిపోయాడు.

"లోపలికి వెళదాం రండి" ఆహ్వానించింది.

పిల్లలు ఆడుకోడానికి బయటికి వెళ్లారో లేక స్కూలుకు వెళ్లారో తెలియదు. ఇల్లు చాలా నిశ్శబ్దంగా ఉంది. తనలో తాను నవ్వుకున్నాడు సోఫాలో కూర్చుంటూ. వారిని చూడాలని ఆసక్తిగా ఉందతనికి.

"తాతయ్య బయటికి వెళ్లారా బామ్మా?"

"ఊహూఁ! పెరట్లో ఆకుకూర పాదులకు నీళ్లు పెడుతున్నారు"

వంటగదిలో నుండి మాటలు వినిపించాయి.

రెండు నిమిషాల తర్వాత సాకేత వెనుక వృద్ధులైన స్త్రీ పురుషులు హాల్‌లోకి వచ్చారు.

"మా తాతయ్య, బామ్మ" వారిని పరిచయం చేసింది.

లేచి నిలబడ్డాడు. సాక్షాత్తు ఆది దంపతుల్లా ఉన్న ఆ వృద్ధులకు చేతులు జోడించి నమస్కరించాడు.

"మా ఆఫీసులో నాతో పాటు పని చేస్తున్నారు. పేరు షణ్ముఖసాయి" వారితో చెప్పింది.

"కూర్చో బాబూ" తాతయ్య చొరవగా నవ్వుతూ అన్నారు.

సాకేత వంటగదిలోకి వెళ్లబోయింది.

తన వెనుకే రాబోతున్న బామ్మను వారించి తాతయ్య పక్కన కూర్చోబెట్టి వెళ్లింది.

"పిల్లలు ఇంకా స్కూలు నుండి రాలేదా?" అడిగాడు.

వృద్ధ దంపతులు అయోమయంగా ముఖాలు చూసుకున్నారు.

కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

పిల్లలు ఇంటికి రాకముందే విషయం మాట్లాడడం మంచిదనిపించింది.

"సాకేతను నేను మనఃస్ఫూర్తిగా ఇష్టపడ్డాను. తనను పెళ్లి చేసుకోవాలని ఆశపడ్డాను. ఈ సంగతి ప్రస్తావించినపుడు పిల్లల గురించి చెప్పింది. తనకు కాబోయే భర్త వాళ్ల బాధ్యత తీసుకోవాలని అంది. ఏ లోటు కలగకుండా చూసుకుంటాను. మీరు అంగీకరించి మా పెళ్లి జరిపించాలి"

వృద్ధ దంపతులకు విషయం అర్థమైంది. ముసిముసిగా నవ్వుకున్నారు.

"అలాగే" అన్నారు ఇద్దరూ ఒకేసారి.

తన కుటుంబ వివరాలు చెప్పాడు.

"నాకు తమ్ముడు, చెల్లాయి ఉన్నారు. చెల్లాయి పెళ్లయి బెంగుళూరులో ఉంటోంది. తమ్ముడు ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం అమ్మా, నాన్న ఒకరి తర్వాత ఒకరు చనిపోయారు. ప్రస్తుతం నేను ఒంటరిగా ఉంటున్నాను"

టీ తయారు చేసి తీసుకొచ్చింది సాకేత.

ఏలకుల సువాసనతో రుచిగా వున్న టీ త్రాగారందరూ.

"పిల్లల స్కూలు బాగా దూరమా? ఇంకా ఇంటికి రాలేదు. టైమ్ ఆరు కావస్తోంది" అన్నాడు గేటు వైపు చూస్తూ.

సాకేత పెదవులపై చిరు

నవ్వు కదలాడింది. ఆమె ఏం సమాధానం చెబుతుందో అని తాతయ్య తల తిప్పి చూశాడు.

"పిల్లలు స్కూలుకు వెళ్లే వయసు కాదు. ఇంటి దగ్గరే ఉన్నారు" చెప్పింది.


"లోపల నిద్రపోతున్నారా?" అడిగాడు.

"నా పిల్లలు వీళ్లే" తాతయ్య, బామ్మ వైపు చూపించింది.

కొద్ది క్షణాల తర్వాత అతనికి విషయం అర్థమైంది.

వృద్ధురాలు కళ్లజోడు తీసి చెమ్మగిల్లిన కళ్లు తుడుచుకుంది.

"అవును. మేము తనకు పిల్లలమే. కొడుకును, కోడల్ని బస్సు ప్రమాదంలో పోగొట్టుకుని సాకేత తోడిదే లోకంగా ఇన్నాళ్లు బతికాము. తనకు మేము, మాకు తను తప్ప ఇంకెవ్వరూ లేరు. తనకు పెళ్లయి వెళ్లిపోతే మా జీవితాలు శూన్యమయిపోతాయని భయపడి పెళ్లి చేసుకోడానికి ఇష్టపడలేదు. మేము పట్టుబడితే తనకు భర్తగా వచ్చే వ్యక్తి మమ్మల్ని చూసుకోవాలన్న షరతు మీద పెళ్లి చేసుకుంటానని చెప్పింది. రెండు, మూడు సంబంధాలు వచ్చినా తన షరతు గురించి తెలుసుకుని వెనక్కి తగ్గారు. వృద్ధుల్ని చూసుకోవాలి అని చెప్పకుండా పిల్లల్ని చూసుకోవాలి అని మీతో చెప్పి ఉంటుంది. అవునా?" తాతయ్య అడిగాడు.



అవునన్నట్లు తలూపాడు షణ్ముఖసాయి. తన సుఖం తను చూసుకోకుండా పెద్దల్ని కడవరకు ప్రేమగా చూసుకోవాలన్న ఆమె అభిప్రాయం అర్థమైంది. సాకేత మీద ఉన్న ఇష్టం రెట్టింపైంది. ఆరాధనగా ఆమె వైపు చూశాడు.

అతను తన వైపు చూడడం గమనించి చూపులు తిప్పుకుంది.

చాకొలెట్లు, బిస్కట్లు ఉన్న క్యారీ బ్యాగ్ తాతయ్యకు అందించాడు.

"పిల్లల కోసమని ఇవి తెచ్చాను. ప్రస్తుతానికి ఇవి తీసుకోండి. ఇక నుండి పండ్లు తీసుకొస్తాను" అన్నాడు నవ్వుతూ.

కొద్దిసేపయ్యాక వారి వద్ద సెలవు తీసుకున్నాడు.

గేటు వరకు వచ్చింది సాకేత.

కొద్ది నిమిషాలు మౌనంగా నిలబడ్డాడతను. ఆమె ఏమైనా మాట్లాడితే బావుండు అని ఆశగా ఎదురు చూస్తున్నాడు. పెద్దవాళ్లు అంగీకరించారు సరే! ఆ మాట తను కూడా చెప్పాలి కదా అనుకుంటున్నాడు లోలోపల.

"పెళ్లి విషయంలో మీ అభిప్రాయం మార్చుకుంటే మొహమాటం లేకుండా చెప్పండి. రెండేళ్ల వయసులో అమ్మానాన్నల్ని పోగొట్టుకున్న నన్ను తాతయ్య, బామ్మ అపురూపంగా పెంచి పెద్ద చేశారు. ఇప్పుడు వాళ్లను బాగా చూసుకోవాలని నా కోరిక" ఆమె మాటల్లో వారి పట్ల ప్రేమ తొణికిసలాడింది.

"నా నిర్ణయంలో మార్పులేదు. ఇక నుండి మీరు ముగ్గురూ నా కుటుంబ సభ్యులు, ఈ పెళ్లికి మీరు ఒప్పుకుంటే" అన్నాడు.

"నా కిష్టమే" సిగ్గుతో అతని మీద నుండి చూపులు తిప్పుకుని పూల మొక్కల వైపు చూడసాగింది.

అతని మనసు ఆనందంతో సయ్యాటలాడింది. సంతోషం పట్టలేక రెండడుగులు దగ్గరగా వచ్చాడు.

అతని చేయి ఆమె చేతిని స్పృశించబోయి సంకోచంగా ఆగిపోయింది. ఇందుకు కూడా షరతులు పెడుతుందేమో! నిశ్శబ్దంగా నవ్వుకున్నాడు.

అతని భావం అర్థమై ముగ్ధమనోహరంగా నవ్విందామె.

"నేను బయల్దేరతాను"

"ఊఁ"

బైక్ వైపు నడిచాడతను.

ooo

కొద్ది రోజుల తర్వాత-

"అలాగే బామ్మా! అలాగే" రాత్రి తొమ్మిదిగంటల వేళ బామ్మతో సౌమ్యంగా చెప్పి బెడ్ రూమ్‌లోకి వచ్చింది సాకేత.

ఏమిటన్నట్లు చూశాడు షణ్ముఖసాయి.

కొద్ది క్షణాలు తటపటాయించింది.

"వాళ్లకు ఆడుకోడానికి పిల్లలు కావాలట! ఇన్నాళ్లు పెళ్లి చేసుకోమని గొడవ. ఇప్పుడు పిల్లల గురించి ఆరాటం. పెళ్లయి ఇంకా నాలుగురోజులు కూడా కాలేదు. ఫ్యామిలీ ప్లానింగ్‌కు మందులు వాడతామేమో అని బామ్మకు భయం. అలాంటివేమీ వాడవద్దని చెప్పింది. అలాగే అన్నాను. వాళ్లు మనమీద చూపే ప్రేమాభిమానాలతో పాటు చాదస్తాన్ని కూడా ఓర్పుగా భరించాలి" భర్త భుజం మీద తల పెట్టుకుని పడుకుంటూ అంది.

అతను నవ్వి సాకేతను దగ్గరకు లాక్కుని హత్తుకున్నాడు.

## ప్రియ డబ్బింగ్

తెలుగు రాని తారలకు వేరే వాళ్లు డబ్బింగ్ చెప్పడం అనేది కామన్ అయిపోయింది. అయితే తను మాత్రం ఇకపై తెలుగులో స్వయంగా డబ్బింగ్ చెప్పాలని అనుకుంటోందిట ప్రియమణి. నటించిన వాళ్లే సొంతంగా డైలాగులు చెప్పినప్పుడు ఆ పాత్రకి న్యాయం చేకూరుతుందనేది ఎవరైనా అంటారు. మరి ప్రియమణి తెలుగు గొంతుని తెరపై మనం త్వరలోనే చూసి వింటాం కాబోలు!